సాక్షి అనంతపురం

బుధవారం ׀ 9 ׀ జూలై ׀ 2025



రైల్వే రక్షణ కవచం

రైళ్లు పరస్పరం ఢీకొనకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కవచ్ రక్షణ వ్యవస్థను రైల్వే శాఖ అందిపుచ్చుకుంది. 8లో



చీనీ టన్ను రూ.21,100

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,100, కనిష్టం రూ.4,200, సరాసరి ధర రూ.15 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం

36.6°/23.8°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఇంటికే మార్కుల జాబితా

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ ఏడాది మార్చిలో జరిగిన ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విద్యాపీఠం) పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పోస్టల్ ద్వారా ఇళ్లకే మార్కుల జాబితాలు పంపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అడ్మిషన్ సమయంలో ఇచ్చిన చిరునామా ఆధారంగా మార్కుల జాబితాలతో పాటు మైగ్రేషన్ కమ్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపారు. పోస్టల్ ట్రాకింగ్ కోసం స్పీడ్ పోస్ట్ నంబరు, సర్టిఫికెట్లు పంపిన చిరునామా వివరాలు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. స్థానికంగా ఉన్న పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

‘వందే భారత్’కు అదనపు కోచ్‌లు



అనంతపురం సిటీ: ఈ నెల 10వ తేదీ నుంచి హైదరాబాద్–యశ్వంత్‌పూర్–హైదరాబాద్ మధ్య తిరిగే వందేభారత్ (20703/20704) రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎనిమిది కోచ్‌లతో నడుస్తుండగా.. అదనంగా మరో ఎనిమిది కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఢిల్లీ వెళ్లిన కలెక్టర్



అనంతపురం అర్బన్: న్యూ ఢిల్లీలో బుధవారం జరగనున్న జాతీయ డీఎంఎఫ్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి ఈ నెల 10వ తేదీన విధులకు హాజరుకానున్నారు. కేంద్ర గనుల శాఖ నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాపునకు రాష్ట్రం నుంచి అనంతపురంతో పాటు వైఎస్సార్ కడప, కర్నూలు, ప్రకాశం, కృష్ణా జిల్లా కలెక్టర్లు హాజరుకానున్నారు.

మునిసిపల్ ఆర్‌డీగా రవీంద్ర బాబు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా మున్సిపల్ ఆర్‌డీగా రవీంద్రబాబు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న ఆయనను అనంతపురానికి బదిలీ చేశారు. ఇక్కడ ఆర్‌డీగా పని చేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించారు.

గురుకులంలో విద్యార్థినికి గాయాలు



విద్యార్థినులను విచారిస్తున్న పోలీసులు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థినికి అనుమానాస్పద స్థితిలో గాయాలయ్యాయి. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన చిన్న కుళ్లాయప్ప, వరలక్ష్మి దంపతుల కుమార్తె పి.మైథిలి.. గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తరగతి గదిలో రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలతో పడి ఉంది. గమనించిన గురుకుల సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. కాగా ఘటనపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమార్తె మాత్రం తరగతి గదిలో డెస్క్ మధ్యలో ఇరుక్కొని కింద పడటంతో కాళ్లు విరిగాయని చెబుతోందని, అయితే తమకు అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థులను రహస్యంగా విచారించారు. మైథిలికి ఎలా గాయాలయ్యాయని తోటి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు.



అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాజన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు



బుక్కరాయసముద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రతి మదిలో వైఎస్సార్

- జిల్లా అంతటా సంబరంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు
- రాజన్న విగ్రహాల వద్ద ఘన నివాళి
- అన్ని ప్రాంతాల్లోనూ సేవా కార్యక్రమాలు

అనంతపురం కార్పొరేషన్: రైతు బాంధవుడు, మహానేత దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం జిల్లా అంతటా ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాడవాడలా వేడుకలు నిర్వహించారు. ‘జోహార్ వైఎస్సార్’ అంటూ నివాళులర్పించారు. రక్తదానం, అన్నదానం, దుస్తుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. మొదట వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ కార్యాలయ ఆవరణలోనే యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ చొరవతో 135 మంది రక్తదానం చేశారు. అనంతరం జెడ్పీ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆరోగ్య శ్రీ, 108, 104, పావలా వడ్డీ తదితర పథకాలను ప్రవేశపెట్టి పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపారన్నారు. మైనార్టీలకు రిజర్వేషన్ అందించి వారి జీవితాలను బాగుపరిచారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, పార్టీ పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్ పాల్గొన్నారు.

- శింగనమల నియోజకవర్గంలో మాజీ మంత్రి, పార్టీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల గుండెచప్పుడు వైఎస్సార్ అని, విద్య, వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించారన్నారు. ఇవాళ ఎంతో మంది ఉన్నత కొలువులు సాధించారంటే అది వైఎస్సార్ చలువేనన్నారు. కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త వీరాంజినేయులు, నాయకులు పూల ప్రసాద్, వంశీ గోకుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కళ్యాణదుర్గంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌లో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తలారి రంగయ్య మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేలా వైఎస్సార్ చర్యలు చేపట్టారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్సీ మంగమ్మ, మునిసిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, పార్టీ నాయకులు తిప్పేస్వామి, ఉమామహేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.
- రాయదుర్గంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత, నాయకులు ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.
- గుంతకల్లులో నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి (వైవీఆర్) ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని వైవీఆర్ కొనియాడారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు తదితరులు పాల్గొన్నారు.
- ఉరవకొండలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాజన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.
- రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఐడీసీ మాజీ చైర్మన్ బుక్కచెర్ల నల్లప్పరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కురుబ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.



కళ్యాణదుర్గంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ



గుంతకల్లులో కేక్ కటింగ్‌లో పాల్గొన్న సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి తదితరులు

సేవాస్ఫూర్తి

వైఎస్సార్ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు 108, 104 ఉద్యోగులకు దుస్తులు పంపిణీ చేశారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీ సమీపాన ఉన్న రాకేష్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. గుత్తి ప్రభుత్వాసుపత్రికి పార్టీ జిల్లా నేత బళ్లారి రాజ్‌కుమార్‌రెడ్డి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వితరణ చేశారు. అనేక చోట్ల రక్త, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.





ఉరవకొండ, తాడిపత్రిలో వైఎస్సార్‌కు పార్టీ శ్రేణుల నివాళి

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



అనంతపురంలో రక్తదానం చేస్తున్న యువకులు



రాప్తాడులో రక్తదానం చేస్తున్న పార్టీ శ్రేణులు



రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో 108, 104 సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మెట్టు విశ్వ, గౌని ఉపేంద్రరెడ్డి తదితరులు



మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

అక్కడ చదివి ఉంటే ఇక్కడ కష్టమే!

- తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులను ఇక్కడ నాన్ లోకల్‌గా పరిగణింపు
- ఏపీఈఏపీసెట్‌లో గణనీయమైన ర్యాంకు వచ్చినా.. మంచి కళాశాలలో సీటు కష్టసాధ్యమే
- ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా రాని పరిస్థితి
- ఏటా 70 వేల మంది దాకా ఏపీ విద్యార్థులు హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి





జేఎన్‌టీయూ హెల్ప్‌లైన్ సెంటరులో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం: హరిత అనే విద్యార్థినికి ఏపీఈఏపీ సెట్‌లో ఎనిమిది వేల ర్యాంకు వచ్చింది. సర్టిఫికెట్ల అప్‌లోడ్‌లో నాన్ లోకల్‌గా నమోదు చేశారు. పొరపాటున నాన్‌లోకల్‌గా నమోదు చేశామని, లోకల్‌గా మార్పు చేయాలని జేఎన్‌టీయూ (అనంతపురం) హెల్ప్‌లైన్ సెంటరుకు వచ్చారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో చదివినందున నాన్‌లోకల్ కిందకే వస్తారని, తెలంగాణలో ఇంటర్ చదివిన వారిని నాన్‌లోకల్‌గా పరిగణించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ నిబంధన వల్ల మంచి కళాశాలలో ఇంజినీరింగ్ సీటు కోల్పోవడమే కాక.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత లేదని తెలుసుకుని హరిత ఆవేదనతో వెనక్కి వెళ్లిపోయారు. ఇలా వేలాది మంది విద్యార్థులు తెలంగాణలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏపీఈఏపీ సెట్–2025లో గణనీయమైన ర్యాంకులు సాధించిన వారికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిబంధనలు శాపంగా మారాయి. మంచి కళాశాలలో సీటు రాని పరిస్థితి నెలకొంది. తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన ఏపీ విద్యార్థులను నాన్‌లోకల్‌గా పరిగణించడమే ఇందుకు కారణం. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంధ్రప్రదేశ్‌లో చదివినప్పటికీ, ఇంటర్మీడియట్ ఒక్కటి తెలంగాణలో చదివినా నాన్ లోకల్‌గా పరిగణిస్తున్నారు. దీంతో మంచి కళాశాలలో సీటు కోల్పోయే ప్రమాదం ఉంది. నాన్ లోకల్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వర్తించదు. ఇంటర్మీడియట్ ఆంధ్రప్రదేశ్‌లో చదివిన వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుంది. దీంతో హైదరాబాద్‌లో ఇంటర్ చదివిన వేలాది మంది విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏపీ విద్యార్థులు హైదరాబాద్‌లో ఏటా 50 వేల నుంచి 70 వేల మంది దాకా ఇంటర్ పూర్తి చేస్తుండడం గమనార్హం. ఇందులో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మూడు వేల మంది దాకా ఉంటున్నారు.

టాప్ 15లోపు ఉంటేనే సీటు!

నాన్‌లోకల్ కేటగిరీలోకి వస్తే మంచి కళాశాలలో సీటు పొందడం కష్టమే. ఒక కళాశాలలో వంద ఇంజినీరింగ్ సీట్లు ఉంటే 50 శాతం ఓపెన్ కేటగిరీకి కేటాయిస్తారు. ఇందులో నాన్‌లోకల్ అభ్యర్థులు టాప్ 15లోపు ఉంటేనే సీటు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణలో ఇంటర్ చదివి ఏపీ ఈఏపీసెట్ రాస్తే నాన్‌లోకల్ కింద సీటు ఇస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ రాసిన ఏపీ విద్యార్థులకూ అక్కడ ఇదే నిబంధన వర్తిస్తోంది. ఇటు ఆంధ్రాలోనూ.. అటు తెలంగాణలోనూ నాన్ లోకల్ కిందే పరిగణిస్తుండడంతో తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులు నష్టపోతున్నారు.

2024 వరకు ఇబ్బంది లేని పరిస్థితి

ఏపీ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఉమ్మడి రాజధాని, ఉమ్మడి విద్యా వ్యవస్థ ఉండేవి. తెలంగాణలో చదివినా, ఏపీలో చదివినా లోకల్‌గానే పరిగణించేవారు. 2024 నుంచి ఈ నియమం తొలగించారు. దీంతో తెలంగాణలో చదివిన ఏపీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఏర్పడింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివించారు. ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకుండా పోతే ఇంజినీరింగ్ చదివించడం కష్టం అవుతుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఏపీలో ఇంజినీరింగ్ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చూడాలని తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హౌస్ అరెస్ట్

- తన నివాసంలోనే వైఎస్సార్‌కు నివాళులర్పించిన కేతిరెడ్డి



స్వగృహంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు మరోసారి హౌస్ అరెస్ట్ చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పాల్గొనే అవకాశముందని, పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుసుకున్న పోలీసులు యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో పెద్దారెడ్డిని గృహ నిర్బంధం చేశారు. ఇందుకు సంబంధించిన నోటీసును ఆయనకు యల్లనూరు ఎస్‌ఐ రామాంజనేయులు రెడ్డి అందజేశారు. దీంతో తన ఇంట్లోనే వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మాట్లాడుతూ.. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు.. రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆడపిల్లలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తాడిపత్రిలో అధికారపార్టీ నాయకులు విచ్చలవిడిగా దొంగతనాలు, గంజాయి, మట్కా దందా జోరుగా సాగిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలతో గత ప్రభుత్వం పేదలకు వెన్నుగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలంటే ఇప్పటికీ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డినే ప్రజలు గుర్తుకు చేసుకుంటారన్నారు. ఏడాది కూటమి పాలనపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. ఫలితంగా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటేష్, భాస్కరరెడ్డి, రాజకుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు మరింత భద్రత

ధర్మవరం అర్బన్: రైలు ప్రయాణికులకు మరింత భద్రత కల్పించనున్నట్లు ఆర్‌పీఎఫ్ సౌత్ సెంట్రల్ జోన్ డీఐజీ షదాన్ ఖాన్ తెలిపారు. సౌత్ సెంట్రల్ పరిధిలోని ధర్మవరం ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పరిసరాలను, పలు పరికరాల పని తీరు పరిశీలించారు. అనంతరం ఆర్‌పీఎఫ్ మహిళా వసతి గృహంలో పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. రైల్వే శాఖలో మహిళా ఉద్యోగుల భద్రతాపరంగా మహిళా వసతి గృహాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. అనంతరం ఆర్‌పీఎఫ్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజనల్ ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాష్‌కుమార్ జైస్వాల్, సీఐ నాగేశ్వరరావు, అధికారులు రోహిత్‌గౌడ్, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేపలపర్తిలో ప్రబలుతున్న అతిసారం



రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయదుర్గం టౌన్: బ్రహ్మసముద్రం మండలం వేపలపర్తి గ్రామంలో అతిసార వ్యాధి విజృంభిస్తోంది. గ్రామానికి చెందిన నలుగురు మహిళలు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ సోమవారం ఇద్దరు మహిళలు, మంగళవారం సాయంత్రం మరో ఇద్దరు మహిళలు రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి చేరారు. బాధితుల్లో లీలావతి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు.

నీట మునిగి ఇద్దరు రాజస్థానీల మృతి

కళ్యాణదుర్గం రూరల్: ప్రమాదవశాత్తు నీట మునిగి రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన జుట్టూ(22), భగత్‌సింగ్(25), సురేష్ బతుకు తెరువు కోసం కళ్యాణదుర్గం వలస వచ్చి ఉడ్ వర్క్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలోని వెంకటేష్ బాబు తోటలోకి వెళ్లి, అక్కడ బొప్పాయి పండ్లను ఆరగించిన అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటి ట్యాంక్ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు జుట్టూ కాలు జారి ట్యాంక్‌లో పడ్డాడు. గమనించిన భగత్‌సింగ్ వెంటనే ట్యాంక్‌లోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీట మునిగిపోయారు. సురేష్, స్థానిక రైతుల నుంచి సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి యువకుల మృతదేహాలను వెలికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీల పురోగతి సూచికపై నేడు శిక్షణ

అనంతపురం సిటీ: పంచాయతీల పురోగతి సూచిక 2.0 అంశంపై అనంతపురంలోని డీపీఆర్సీ భవన్‌లో ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతులకు ఉమ్మడి జిల్లాలోని అధికారులు హాజరు కానున్నారు. ఒక్కో మండలం నుంచి ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ లేదా కంప్యూటర్ ఆపరేటర్ శిక్షణకు హాజరు కావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన సమాచారం ఇప్పటికే అన్ని మండలాల అధికారులకు పంపినట్లు జెడ్పీ వర్గాలు వెల్లడించాయి.

రైల్వే రక్షణ కవచం

సాంకేతిక లోపం కారణంగా ఒకే లైనుపై ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రైళ్లు ఢీకొన్న ఘటనలు గతంలో చాలా చోట్ల జరిగాయి. ఆయా ఘటనల్లో పలువురు ప్రయాణికులు చనిపోవడంతో పాటు రైల్వేకు భారీ నష్టాలూ చేకూరాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల భద్రతా చర్యల్లో భాగంగా రైళ్లు పరస్పరం ఢీకొనకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైల్వే శాఖ సమకూర్చుకుంది. దాని పేరే 'కవచ్'.

- కవచ్ వ్యవస్థతో ఆటోమేటిక్‌గా ఆగిపోనున్న రైళ్లు
- ప్రస్తుతం గుంతకల్లు–డోన్ సెక్షన్ మార్గంలో ఏర్పాటు
- త్వరలో గుంతకల్లు డివిజన్‌లోని అన్ని సెక్షన్లలో ఏర్పాటుకు చర్యలు



రైలింజన్‌లో ఏర్పాటు చేసిన కవచ్ పరికరాలు



రైలింజన్‌లో కవచ్ పనితీరును డీఆర్ఎంకు వివరిస్తున్న సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్

గుంతకల్లు: రైలు ప్రమాదాలు చోటు చేసుకునేందుకు ప్రధాన కారణం సిగ్నలింగ్ సమస్య. ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో అత్యధికంగా ఒకే లైనుపై రెండు రైళ్లు ఎదురెదురుగా దూసుకు రావటం వల్ల చోటు చేసుకున్నవే ఉండడం బాధాకరం. ఈ తరహా ప్రమాదాలను నియంత్రించగలిగి ప్రయాణికుల భద్రతకు భరోసానిచ్చే దిశగా రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూపొందించిన ట్రైన్ కొలిజన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టీసీఏఎస్)ను దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తీసుకువచ్చింది. కవచ్ అనే పేరుతో పిలువబడే టీసీఏఎస్ పనితీరును ఇప్పటికే క్షేత్రస్థాయిలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పరీక్షించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గుంతకల్లు–డోన్ సెక్షన్‌లో కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దశల వారీగా గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు.

రక్షణ కవచం పని చేస్తుంది ఇలా..

కవచ్ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా రైళ్లలో మైక్రో ప్రాసెసర్లు, గ్లోబల్ పొజిషనింగ్ వ్యవస్థ (జీపీఎస్), యాంటీ కొలిజన్ పరికరాలను రైలు ఇంజన్‌లో ఏర్పాటు చేస్తారు. వీటిని రైల్వే ట్రాక్‌లకు అనుసంధానిస్తారు. ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ప్రతి స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టవర్ల ద్వారా రైలింజన్‌లోని కవచ్ యాంటీనాలు రేడియో ఫ్రీక్వెన్సీల స్వీకరిస్తూ వాటికి అనుగుణంగా పనిచేస్తుంటాయి. ప్రయాణంలో ఉండగా లోకో పైలెట్ రెడ్ సిగ్నల్ గుర్తించకపోవడం... సిగ్నల్ దాటి ముందుకెళ్లడం... పరిమితికి మించిన వేగంతో రైలు ప్రయాణించడం, రైలు వేగాన్ని లోకో పైలెట్ నియంత్రించలేకపోవడం తదితర సమస్యలు ఎదురైనప్పుడు కవచ్ వ్యవస్థ స్వతంత్రంగా పనిచేయడం మొదలు పెడుతుంది. సిగ్నల్ జంప్ కాగానే వెంటనే లోకో పైలెట్‌ను అప్రమత్తం చేస్తుంది. బ్రేక్‌లను నియంత్రిస్తుంది. నిర్ణీత దూరం లోపు అదే లైనులో మరో రైలును గమనించినప్పుడు స్వయం చాలకంగా రైలు కదలికను నిలిపివేస్తుంది.

కి.మీ రూ.50 లక్షలు వ్యయం..

గుంతకల్లు డివిజన్ దాదాపు 1450 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇందులో వాడి–రేణిగుంట, గుత్తి–ధర్మవరం, ధర్మవరం–పాకాల. పాకాల–కాట్పాడి, నంద్యాల–యర్రగుంట్ల, గుంతకల్లు–బళ్లారి సెక్షన్లలో దశల వారీగా కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం గుంతకల్లు–డోన్ మధ్య ఉన్న 69 కి.మీలకు కి.మీకు రూ.50 లక్షలు చొప్పున దాదాపు రూ.345 కోట్లను రైల్వే శాఖ ఖర్చు చేసింది. ఈ మార్గంలో తిరిగే దాదాపు 20 నుంచి 30 రైలింజన్‌లో కవచ్ పరికరాలను ఏర్పాటు చేశారు. అలాగే వాడి–రేణిగుంట మధ్య 538 కి.మీల పరిధిలో ఉన్న 60 స్టేషన్లతో పాటు 200కు పైగా రైలింజన్లలో కవచ్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రైలు ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా కవచ్ లాంటి అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. ప్రస్తుతం గుంతకల్లు – డోన్ సెక్షన్‌లో కవచ్‌ను ఏర్పాటు చేశాం. త్వరలో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా అన్ని సెక్షన్లలో ఈ పరికరాలను ఏర్పాటు చేయనున్నాం.

– చంద్రశేఖర్, సీనియర్ డీఎస్‌టీఈ, గుంతకల్లు

ఇరువర్గాలపై కేసు నమోదు



విచారిస్తున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

బొమ్మనహాళ్: మండలంలోని రెండు గ్రామాల్లో చోటు చేసుకున్న దాడులకు సంబంధించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. దాడులకు కేంద్రమైన బొమ్మనహాళ్ మండలం కొలగానహళ్లి, మైలాపురం గ్రామాల్లో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ ఎస్ఐలు నబీరసూల్, నాగమధు, గురుప్రసాద్‌రెడ్డితో కలసి మంగళవారం డీఎస్పీ పర్యటించారు. కొలగానహళ్లికి చెందిన అనంతరాజుపై జరిగిన దాడితో పాటు మైలాపురంలో, విజయకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిపై స్థానికులతో ఆరా తీశారు. అనంతరాజుపై దాడి చేశారని ఆయన కొడుకులు, బంధువులు సోమవారం రాత్రి మైలాపురంలో తన ఇంటిపై దాడి చేశారని, ఘటనలో రెండు ద్విచక్ర వాహనాలు, కారు, ఇంట్లోని టీవీ, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని, గడ్డివామికి సైతం నిప్పు పెట్టారంటూ డీఎస్పీకి విజయ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు వివరించారు. దాదాపు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం కలిగించారని వాపోయారు. విచారణ అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. మైలాపురంలో అనంతరాజుపై దాడికి పాల్పడిన విజయ్‌కుమార్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు, విజయ కుమార్ రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడి, ఆస్తి నష్టం కలిగించినందుకు అనంతరా, ఆయన కొడుకులు, బంధువులు దాదాపు 38 మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

- నిందితుల్లో ఒకరు గుజరాత్‌లోని సూరత్ నివాసి
- ఆరేళ్ల వయసులోనే అనంతకు చేరుకున్న వైనం
- రూ.12 లక్షల విలువైన సొత్తు రికవరీ



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: ఇళ్లలోకి ప్రవేశించి బంగారు నగలు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు అపహరిస్తున్న విక్కీ అలియాస్ షామీర్‌తో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేస్తున్న ఫరూక్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం రెండో పట్టణ పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ శ్రీకాంత్ యాదవ్ వెల్లడించారు. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన సలీం కుమారుడు మాదిరి కత్రి విక్కీ అలియాస్ షామీర్ (20) తన ఆరేళ్ల వయసులోనే పారిపోయి అనంతపురానికి చేరుకున్నాడు. అప్పట్లో విజయనగర కాలనీలోని అనాథ ఆశ్రమంలో ఉంటూ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి వరకు చదువుకున్నాడు. ఈ క్రమంలోనే చిల్లర దొంగతనాలు చేస్తూ రాత్రి సమయాల్లో ఇళ్లలోకి చొరబడి చోరీలు చేయడం ప్రవృత్తిగా మార్చుకుని, చివరకు దొంగతనాల్లో రాటుదేలాడు. 2024, నవంబర్‌లో అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న ఇంట్లోకి వారం వ్యవధిలో రెండు సార్లు చొరబడి రెండు బంగారు గాజులు అపహరించాడు. అలాగే ఈ ఏడాది జూన్‌లో ఓ యమహా బైక్, గోవాలో ఐ ఫోన్, ఆపిల్ ల్యాప్‌టాప్‌ను అపహరించాడు. ఆయా కేసుల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ప్రసన్నాయపల్లి రైల్వే గేటు వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న షామీర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వరుస చోరీలు వెలుగుచూశాయి. గతంలో చోరీ చేసిన సొత్తుతో పాటు పలు సందర్భాల్లో అపహరించిన 8 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లను రికవరీ చేశారు. అలాగే నాలుగు సెల్‌ఫోన్లను కొనుగోలు చేసిన ఫరూక్ అరెస్ట్ చేసి నాలుగు సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఇద్దరి నుంచి రికవరీ చేసిన మొత్తం ఆరు తులాల బంగారు గాజులు, 12 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఒక స్కూటీ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీసీఎస్ సీఐ వలిబాషా, జయపాల్‌రెడ్డి, టూ టౌన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్, ఎస్ఐ రుష్యేంద్రబాబును ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

సచివాలయ బదిలీలలు

- న్యాయం కోసం కలెక్టర్‌కు ఉద్యోగుల ఫిర్యాదు
- వ్యవసాయ, పోలీసు శాఖల్లో అడ్డగోలు వ్యవహారం
- వ్యవసాయ శాఖలో తారస్థాయిలో అక్రమాలు
- వారమవుతున్నా ఫిర్యాదుపై ఎటూ తేల్చని వైనం
- సత్వర పరిష్కారంతోనే బాధితులకు ఊరట



ఈ నెల 2న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు

అనంతపురం అర్బన్: ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మెరిట్ (ర్యాంక్) ఆధారంగా బదిలీలు నిర్వహించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా రాజకీయ సిఫారసులకు తలొగ్గారు. ఫలితంగా స్థానాల కేటాయింపులో అర్హులైన ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగింది. దీంతో బాధిత ఉద్యోగులు న్యాయం కోసం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికంగా వ్యవసాయ శాఖ పరిధిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పోలీసు శాఖ పరిధిలోని మహిళ సంరక్షకులు (మహిళ పోలీసు) ఉన్నారు.

సిఫారసులకే పెద్దపీట

వ్యవసాయశాఖలో సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఓ ప్రహసనంలా సాగిందనే ఆరోపణలున్నాయి. బదిలీల ప్రక్రియలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు మెరిట్ ఆధారంగా కాకుండా ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు తొలి ప్రాధాన్యతనివ్వడం విమర్శలకు తావిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో 2వ ర్యాంకు, ఉమ్మడి జిల్లాలో 5వ ర్యాంక్‌లో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మితకు, అదే జిల్లాలో 3వ ర్యాంకు, ఉమ్మడి జిల్లాలో 6వ ర్యాంక్ ఉన్న జనార్దన్‌కు.. దివ్యాంగుల కోటా కింది శిరీష్.. వారు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం కాకుండా అధికారులకు తమకు ఇష్టమొచ్చిన చోటికి పోస్టింగ్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనం. వీరు కోరిన ఆప్షన్లను వీరి తర్వాతి ర్యాంకు వారికి కట్టబెట్టినట్లుగా తెలిసింది. ఇదే తరహాలో చాలా మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అధికారులు ఇష్టానుసారంగా పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం.

ఎటూ తేల్చని అధికారులు

బదిలీల ప్రక్రియలతో తమకు అన్యాయం జరిగిందంటూ కలెక్టర్‌కు ఈ నెల 2న అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతే కాక కలెక్టర్‌ను వారు ఇప్పటికి మూడుసార్లు కలసి న్యాయం చేయాలని కోరారు. ఇక 4న కలెక్టర్‌కు మహిళ సంరక్షకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి వారం రోజులవుతున్నా అధికారులు ఎటూ తేల్చలేదని బాధిత అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిలీవ్ కావాలని మరోవైపు అధికారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రమయ్యాయని వాపోతున్నారు.

సత్వర పరిష్కారంతోనే ఊరట

అందిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సత్వర పరిష్కారంతోనూ బాధితులకు న్యాయం చేకూరుతుంది. అయితే సచివాలయ ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

రెక్కీ నిర్వహించి.. గొలుసు అపహరణ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు పద్మావతి

రాప్తాడు రూరల్: రెండు రోజుల పాటు రెక్కీ నిర్వహించిన అనంతరం ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును యువకుడు లాక్కొని ఉడాయించాడు. వివరాలు.. శింగనమల మండలం శివపురం గ్రామానికి చెందిన రమణయ్య, పద్మావతి దంపతులు కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరినగర్‌లో స్థిరపడ్డారు. సొంతూరిలో ఉన్న భూముల్లో భర్త వ్యవసాయం చేస్తున్నాడు. పద్మావతికి గుండె శస్త్రచికిత్స జరగడంతో వ్యవసాయ పనులకు వెళ్లలేక కళ్యాణదుర్గం ప్రధాన రహదారి పక్కనే ఓ బంకు ఏర్పాటు చేసుకుని కూల్‌డ్రింక్స్, స్నాక్స్ విక్రయిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఓ యువకుడు వచ్చి బంక్ వద్ద దాదాపు గంట పాటు కూర్చొని వెళ్లాడు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో అదే యువకుడు మరోమారు వచ్చి సిగరెట్ తీసుకుని తాగాడు. 2.30 గంటల వరకు అక్కడే కూర్చున్నాడు. అనంతరం నీళ్లు అడగడంతో ఇచ్చేందుకు పద్మావతి ఫ్రిజ్ తెరుస్తుండగా ఒక్క ఉదుటన వెనుక నుంచి నోటిని గట్టిగా అదిమపెట్టి మెడలో ఉన్న బంగారు చైనును లాక్కొని, ఆమెను గిరాటేసి వెళ్లిపోయాడు. ఈ హఠత్పరిణామంతో కాసేపటి వరకూ ఆమె కోలుకోలేక పోయింది. చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడు ఎలాంటి బెదురు లేకుండా నింపాదిగా నడుచుకుంటూ వెళ్లడం విశేషం. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నేత సోదరి కట్టడం కూల్చివేత



నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేసిన దృశ్యం

తాడిపత్రి రూరల్: స్థానిక పెన్నానది ఒడ్డున వైఎస్సార్ సీపీ నాయకుడు అయూబ్ బాషా సోదరి చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని అనధికార కట్టడం పేరుతో మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అన్ని అనుమతులు ఉన్నా... కేవలం అన్న వైఎస్సార్‌సీపీ నాయకుడనే అక్కసుతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లుగా తాడిపత్రిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మంగళవారం తెల్లవారుజాము 6 గంటలకే హిటాచీతో అక్కడకు చేరుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది దౌర్జన్యంగా కట్టడాన్ని కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారి సుజాత మాట్లాడుతూ... రోడ్డును 5 మీటర్లు ఆక్రమించారని, సెట్‌బ్యాక్ లేకపోవడం, ప్లాన్‌కు వ్యతిరేకంగా నిర్మాణం చేపట్టినందుకు కట్టడాన్ని కూల్చివేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇది పూర్తిగా కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని అయూబ్ బాషా వాపోయారు.

జలధి ఉత్సవంలో ఘర్షణ





గాయపడిన నాగరాజుగౌడ్, ఆంజనేయులుగౌడ్

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురంలో సోమవారం రాత్రి జరిగిన పీర్ల జలధి ఉత్సవంలో ఘర్షణ చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు.. పీర్లను జలధికి తరలిస్తున్న సమయంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరో పది నిమిషాల్లో ఉత్సవం ముగుస్తుందనగా.. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు యువకుల మధ్య చిన్నపాటి గొడవ మొదలైంది. ఒకరికొకరు తోడవడంతో గొడవ పెద్దదైంది. ఆంజనేయులు గౌడ్, నాగరాజు గౌడ్ తాలూకు యువకుడు గొడవలో ఉండటంతో వారు సర్ది చెప్పేందుకు మధ్యలోకి వెళ్లారు. అదే సమయంలో మాటామాట పెరిగి యువకులు బొజ్జయ్య, అనిల్, ఆనంద్, కుమార్ నేరుగా ఆంజనేయులు గౌడ్, నాగరాజు గౌడ్‌పై దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుల బరి తెగింపు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై వేటకొడవళ్లతో దాడి
- విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు గోపి తలకు లోతైన గాయం



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన గోపి




గోపి తలపై ఏర్పడిన లోతైన గాయం

బ్రహ్మసముద్రం: మండలంలో టీడీపీ నేతలు బరితెగించారు. కక్షకట్టి ఎర్రప్ప దొడ్డి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు గొల్ల గోపి, కార్యకర్త బాలకృష్ణపై వేటకొడవళ్లతో దాడి చేశారు. బాధితుడు గోపి తెలిపిన మేరకు... మంగళవారం సాయంత్రం తన పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పెడుతుండగా టీడీపీకి చెందిన డీలర్ కృష్ణమూర్తి, అతని అనుచరులు గోవిందు, నాగరాజు, తిప్పేస్వామి, రాజప్ప, ఎర్రిస్వామి, మైలారీ తదితరులు వేటకొడవళ్లు, కర్రలతో దాడికి తెగబడ్డారు. ఘటనలో గోపి తలకు లోతైన గాయమైంది. బాలకృష్ణకూ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు హుటాహుటి కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు.

నెల్లూరుపై కడప విజయం

- అనంతపురం, చిత్తూరు మ్యాచ్ డ్రా



మచ్చా దత్తా రెడ్డి (164 పరుగులు)



శ్రీకాంత్ (5 వికెట్లు)

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ క్రీడామైదానం వేదికగా అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సీనియర్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లో నెల్లూరుపై కడప జట్టు విజయం సాధించింది. అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ డ్రా అయింది. వివరాలు.. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు నాలుగు వికెట్ల నష్టానికి 199 పరుగులతో బ్యాటింగ్‌కు వచ్చిన అనంతపురం జట్టు 90 ఓవర్లలో 377 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో రంజీ క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి 196 బంతుల్లో 9 సిక్సర్లు, 16 ఫోర్లతో 164 పరుగులు చేశారు. చిత్తూరు రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ ధ్రువ 48 బంతుల్లో రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 81 పరుగులు, మరో బ్యాటర్ మోనిష్ 64 పరుగులు సాధించారు. కాగా, అనంతపురం జట్టుపై మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత ప్రదర్శించిన చిత్తూరు జట్టుకు మూడు పాయింట్లు, అనంతపురం జట్టుకు ఒక పాయింటు దక్కింది. రెండో మైదానంలో నెల్లూరు జట్టుతో తలపడిన కడప జట్టు 5 వికెట్లతో విజయం సాధించి ఆరు పాయింట్లను తన ఖాతాలో వేసుకుంది. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 179 పరుగులు ఆరు వికెట్ల నష్టానికి బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు 215 పరుగులకు ఆలౌట్ అయింది. నెల్లూరు బ్యాటర్ రేవంత్ రెడ్డి 76 పరుగులు సాధించాడు. 259 పరుగుల లక్ష్యాన్ని కడప జట్టు సునాయసంగా ఛేదించింది. కేవలం 43.1 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 263 పరుగులు సాధించింది. కడప బ్యాటర్లు ధ్రువ 103 బంతుల్లో మూడు సిక్సర్లు, 10 ఫోర్లతో 101 పరుగులు చేసి విజయానికి తోడ్పాటునందించాడు. కడప బౌలర్లు శ్రీకాంత్ 5 వికెట్లు, ఆశిష్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

టీడీపీ ట్రోల్స్‌పై న్యాయవాదుల ఆగ్రహం

- నేటి నుంచి రెండు రోజుల పాటు విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న సీనియర్ న్యాయవాదులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సాగిస్తున్న ట్రోల్స్‌పై జిల్లా న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ట్రోల్స్‌ను ఖండిస్తూ బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిపై జరుగుతున్న ట్రోలింగ్‌ను న్యాయవ్యవస్థపై దాడిగా అభివర్ణించారు. సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తిపైనే ట్రోలింగ్ చేస్తే.. సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రోలింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రెండు రోజుల పాటు న్యాయవాదులు విధులు బహిష్కరించాలని బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బడా నారాయణరెడ్డి, శ్రీకాంత్, భరత్‌భూషణ్ రెడ్డి, అవ్వా సురేష్ తదితరులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు బార్ అసోసియేషన్ సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో బుధ, గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించనున్నారు.

పొగాకు ఉత్పత్తులపై సోదాలు



దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సమీపంలో ఉన్న వ్యాపార సముదాయాలు, దుకాణాలు, టీ కేఫ్‌లలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టడంలో భాగంగా పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ముఖ్యంగా గంజాయితో తయారు చేసి అక్రమంగా విక్రయించే చాక్లెట్లు, చుట్టలపై లోతుగా పరిశీలించారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 2003 పొగాకు నియంత్రణ చట్టం నిబంధనల మేరకు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM అడ్మిషన్స్

■ ఇంటర్మీడియట్ లో Any Group పాస్ స్టూడెంట్స్ కి G.N.M (Nursing) కి గవర్నమెంట్ సీట్స్ కలవు. అనంతపురం నందు గల గర్ల్స్ కాలేజీ లో అడ్మిషన్స్ పొందవచ్చు. సంప్ర: G. మురళి, 9030661651, అనంతపురము. [A-7431]

EDUCATION

■ B.Sc Agriculture "Exciting Opportunity for BiPC Students! A top college in Bangalore offers a 4-year B.Sc. in Agriculture & Entrepreneurship with assured placements opportunities. Contact for admissions: 93917 25796, 96188 77726." [A-7130]

REAL ESTATE

LEASE / RENT

■ రాప్తాడు NH:44కి దగ్గరలో సర్వే నెం. 514-2C నందు 2.10 ఎకరముల విస్తీర్ణం గల ఓపెన్ ప్లాటు పొలం వాణిజ్య అవసరాలకు లీజు/రెంట్‌కు ఇవ్వబడును. సంప్ర: 9618877726. [SCA25005998]

RENT / LEASE

■ ATP టౌన్, NH:44, సుధీర్ లారీ కాటా వెనకాల, DMart lane/రిలయన్స్ డిజిటల్ ప్రక్కన ఉన్న రెస్టారెంట్ / 70 సెంట్ల ఖాళీ స్థలం బాడుగకు ఇవ్వబడును. Contact: 6305772976. [SCA25005906]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647. [V-6770]

WANTED

■ Required Field Executives for Electronic Goods Procurement from stores. Ph.No: 9133399257, 9703333378. [G-145]

■ SBI నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు BRE లు కావలెను. (బ్యాంక్ లోపల కూర్చొని చేసే ఉద్యోగం) ఏదేని డిగ్రీ, 30 సం. లోపు, జీ: 18-24 వేలు. 9121278009, 9849848817. [T-2500]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

■ Airtel Wifi – Sales Executives required to work in Anantapur Town. Salary: ₹ 16,500 + Incentives Requirements: Android Phone, Bike, Mandatory. Contact: Cell: 9492404313. [SCA25006048]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

అద్దెకు, అమ్మకాలు, ఉద్యోగ ప్రకటనలు, ఫర్నీచర్స్, ఆటోమొబైల్, కంప్యూటర్స్, సర్వీసెస్, జాతకాలు

4 లైన్లు రూ. 270/-

అదనపు లైను రూ. 60/-

ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9494767933
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

క్లుప్తంగా

జాతీయ సదస్సులో పీజీ వైద్యుల ప్రతిభ



అనస్థీషియా పీజీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా

అనంతపురం మెడికల్: ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగిన దక్షిణ భారతదేశ రాష్ట్రాల అనస్థీషియా సదస్సులో ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ వైద్యులు ప్రతిభ చూపారు. ఫ్రీ పేపర్ విభాగంలో డాక్టర్ గౌతమి, క్విజ్ పోటీల్లో డాక్టర్ పూజ, డాక్టర్ సుదీర్, రీల్స్ విభాగంలో డాక్టర్ శ్రీధర్ సాత్‌జోన్ అవార్డులను కైవసం చేసుకున్నారు. మంగళవారం వైద్య కళాశాలలో ప్రతిభ కనబరచిని విద్యార్థులను ప్రిన్సిపల్ షారోన్ సోనియా అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం, అనస్థీషియా వైద్యులు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ షెలియా, డైసీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవం



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ పద్మశ్రీ, అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల 110వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ.. ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఎందరో విద్యార్థులకు ఉన్నత జీవితాన్ని కళాశాల అందించిందన్నారు. అనంతరం కళాశాలకు సంబంధించిన మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ యోగీశ్వర్ నాయుడు, సీపీడీసీ కార్యదర్శి డాక్టర్ కేశవులు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జితేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ నేతల దాష్టీకం

- మేయర్ వసీం ఫ్లెక్సీల తొలగింపు



సప్తగిరి సర్కిల్‌లో మేయర్ వసీం ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో కూటమి ప్రభుత్వం విష సంస్కృతిని తెరపైకి తెస్తోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు వేసుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీన్ని కూడా జీర్ణించుకోలేని తెలుగు తమ్ముళ్లు కవ్వింపు చర్యలు చేపట్టారు. సాక్షాత్తు నగర మేయర్, ప్రథమ పౌరుడైన వసీం సలీం.. వైఎస్సార్ జయంతి సందర్భంగా నగరంలోని సప్తగిరి సర్కిల్, జెడ్పీ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఆ ఫ్లెక్సీలను తెలుగు తమ్ముళ్లు తొలగించి ప్రథమ పౌరుడిని తీవ్రంగా అవమానించారు. కనీసం ఒక్క రోజు కూడా ఫ్లెక్సీలు లేకుండా ఉండేలా వ్యవహరించడం తమ్ముళ్ల నీచ సంస్కృతికి అద్దం పడుతోంది.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యహేల

అనంతపురం కల్చరల్: గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి సాగిన శాస్త్రీయ నృత్యహేల ఆకట్టుకుంది. నగరంలోని మూడవ రోడ్డులో షిరిడిసాయి మందిరం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై నర్తన డ్యాన్స్ అకాడమీ అమూల్య హరిష్ ఆధ్వర్యంలో చిన్నారులు త్యాగయ్య, అన్నమయ్య కృతులకు నర్తించారు. బాబా మందిరం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, డీఆర్‌ఓ మలోల తదితరులు చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సన్మానం



రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న నాయకులను మంగళవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కురుబ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలివి లింగారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బోయ రామాంజినేయులు, మహిళా విభాగపు నియోజకవర్గ అధ్యక్షురాలు ఉషారాణి, శ్రీ సత్యసాయి జిల్లా వలంటీర్ల విభాగం అధ్యక్షుడు హరినాథ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్నతో పాటు మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ ఐడీసీ చైర్మన్ నల్లప రెడ్డి, ఆగ్రోస్ కేశవ రెడ్డి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

- వైఎస్సార్ చలువతోనే రాయలసీమకు కృష్ణా జలాలు
- ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీతో పేదల జీవితాల్లో వెలుగులు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురంలోని జిల్లా పరిషత్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురం కార్పొరేషన్: 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ గొప్ప పరిపాలనాదక్షుడు. ఆయన ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. భౌతికంగా ఆయన మన మధ్య లేకున్నా.. ఇప్పటికీ స్మరించుకుంటున్నామంటే ప్రజలకు చేసిన మేలే' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. మొదటగా జిల్లా అధ్యక్షుడు అనంత కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. అనంతరం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డిని కలుపుకుని మొత్తం 135 మంది రక్తదానం చేశారు. పార్టీ ఇంటెలెక్చువల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2.0 డైరీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువును పాలదోలడానికి జలయజ్ఞం ద్వారా 86 ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది మహానేత వైఎస్సార్ చలవే అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకువచ్చి పనులు ప్రారంభించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేదల పిల్లలు ఉన్నత చదువులు చదవేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్‌ను కల్పించడంతో ఎంతో మంది ముస్లిం మైనార్టీలు ఉన్నత కొలువులు సాధించారన్నారు. వైఎస్సార్ కుటుంబంతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యపడిందన్నారు. పార్టీ పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైఎస్సార్ పాలన ఆదర్శవంతంగా సాగిందని, మహానేత స్ఫూర్తితో ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు మరింత మెరుగైన పాలనన అందించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వెన్నం శివరామిరెడ్డి, చింతకుంట వెంకటేశులు, రంగంపేట గోపాల్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థ నాయక్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, అమర్‌నాథ్ రెడ్డి, ఉమాపతి, ఓబిరెడ్డి, సైఫుల్లాబేగ్, చంద్రశేఖర్ యాదవ్, రిలాక్స్ నాగరాజు, మల్లెమీద నరసింహులు, శ్రీనివాసులు నాయక్, చింతా సోమశేఖర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా నాయకులు అనంత చంద్రారెడ్డి, బండి కిరణ్, రామయ్య, దాదు, పెన్నోబులేసు, మీసాల రంగన్న, రాజగోపాల్, పామిడి వీరాంజనేయులు, థామస్, వెన్నపూస రామచంద్రారెడ్డి, శ్రీనివాస్ దత్తా, కోనా రాజారెడ్డి, మిద్దె నగేష్, అనిల్‌కుమార్ గౌడ్, కైలాష్, తానీష, శంకరయ్య, రమేష్, కేశవరెడ్డి, దేవి, కృష్ణవేణి, భారతి, పార్వతి, ఉష, ప్రియాంక పాల్గొన్నారు.

108, 104 ఉద్యోగులకు దుస్తుల పంపిణీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు 108, 104 ఉద్యోగులకు పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రాణాపాయంలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్పించడంలో 108 ఎంతో కీలకంగా పని చేసిందన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం..

అనంతపురం కార్పొరేషన్: పార్టీ శ్రేణుల సేవా దృక్పథం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీ సమీపంలోని రాకేష్ వృద్ధాశ్రమంలో పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో వృద్ధులతో కలసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు అనంత ప్రారంభించారు. రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. పార్టీ ఇంటెక్చువల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి తనీష ఆధ్వర్యంలో కమలా నగర్‌లోని నిరాశ్రయ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. పార్టీ బీసీ సెల్ అనంతపురం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు ధనుంజయ యాదవ్, అసిఫ్, గౌస్‌బేగ్, చింతకుంట మధు, శ్రీనివాసులు, ఆలమూరు సుబ్బారెడ్డి, పీవీ రమణారెడ్డి, జగదీష్, లోక్‌నాథ్ రెడ్డి,కేశవరెడ్డి, షెక్షా, శ్రీనివాసులు, ఉషారాణి, ఉషా బాయి, రాధాయాదవ్, భూమిరెడ్డి జాహ్నవి, దేవి, అంకిరెడ్డి ప్రమీళ, కార్పొరేటర్లు కమల్ భూషన్, అనిల్ కుమార్ రెడ్డి, సంపంగి రామాంజనేయులు, అబూసలేహా, జయలలిత, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

అనంతపురం: డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు బడా నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన సర్క్యులర్‌ను పోలీసులు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో సుప్రీంకోర్టు నిబంధనలు పొందుపరిచింది. వీటిని ఉల్లంఘించినట్లయితే పోలీసులపై కోర్టు ధిక్కరణ కేసులు పెడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్షావలి, సురేంద్రాచారి, మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ నగర్‌లో..

రాప్తాడురూరల్: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

రాప్తాడు: 'మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా దూరమై ఏళ్లు గడిచినా.. ప్రతి గుండెలో గూడు కట్టుకుని ఉన్నారు. దేశ రాజకీయాల్లో ఆ కీర్తి ఆయనకే దక్కుతుంది' అని మాజీ ఐడీసీ చైర్మన్ బుక్కచెర్ల నల్లప రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కురుబ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి అన్నారు. రాప్తాడులో మహనేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలివి లింగారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 60 మంది యువకులు రక్తదానం చేశారు.



ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోరంట్ల మాధవ్



రక్తదానం చేసిన అనంతరం సర్టిఫికెట్లను చూపుతున్న యువకులు

వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం..

రాప్తాడు: పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ అనాథాశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయులతో కలసి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేశ్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చంద్ర, చిరుతల నాగేంద్ర, చింతకాయల జయన్న, రామలింగమయ్య, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జ్ఞానమ్మ, హెచ్‌ఎం అమలా మేరీ తదితరులు పాల్గొన్నారు.

మరుపురాని నేత వైఎస్సార్

ఆత్మకూరు: వైఎస్సార్ ప్రజల గుండెల్లో మరపురాని నేతగా నిలిచారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. ఆత్మకూరు, ముట్టాల, గొరిదిండ్ల తండా, వడ్డుపల్లి, తలుపూరు, సింగంపల్లి, పి.యాలేరు, బి.యాలేరు గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ విగ్రహాల వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్రాముడు, మల్లన్న, ఫణిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, అతిక్‌రెడ్డి, శివారెడ్డి, గోపాల్ రెడ్డి, కృష్ణా నాయక్, పెద్ద కొండారెడ్డి, బాలస్వామి రెడ్డి, వన్నూరప్ప, అంజినప్ప, సుదాకర్‌రెడ్డి, మాదన్న, రమేష్, గోవింద్, దామోదర్‌రెడ్డి, మురళి, శ్రీరామ్, ఓబుళపతి, రాజశేఖర్, రామాంజి, ఆంజనేయులు, మనోహర్ రెడ్డి, శ్రీరాములు, ఈశ్వర రెడ్డి, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వైఎస్సార్

అనంతపురం: డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పథకాల ప్రదాతగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు చిగండి రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నిర్వహించారు. ఆకుతోటపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్కేయూలో వైఎస్సార్ విద్యార్థి విభాగం కృషి కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు గెలివి జయచంద్రా రెడ్డి, చిగండి రమేష్, ఎస్‌ఎస్‌యూఐ నాయకులు పులిరాజు, చిన్న శంకర్ నాయక్, సురేష్ కుమ్మర, భరత్ యాదవ్, సురేష్, ప్రదీప్ , సర్పంచ్ చిట్ర గురుప్రసాద్, ననకోట ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బడా నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు



ఆత్మకూరు: నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజన్న పాలన సువర్ణ యుగం

రాప్తాడు: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన ఒక సువర్ణ యుగం. వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మదిలో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని మాజీ ఐడీసీ చైర్మన్ బుక్కచెర్ల నల్లప రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు కురుబ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి కొనియాడారు. మంగళవారం రాప్తాడులో మహనేత వైఎస్సార్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలివి లింగారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 44వ జాతీయ రహదారిపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యకర్తలు, నాయకులతో కలసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, జెడ్పీటీసీ చంద్రకుమార్, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఉషారాణి, శ్రీసత్యసాయి జిల్లా వలంటీర్ల విభాగం అధ్యక్షుడు హరినాథ రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లే మంజునాథ్, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, మండల కన్వీనర్లు సాకే వెంకటేశ్, మీనుగ నాగరాజు, బండి పవన్ కుమార్, గోవింద్ రెడ్డి, మహిళ విభాగం కన్వీనర్ వరలక్ష్మి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, నాయకులు జూటూరు శేఖర్, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, జూటూరు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్ రెయిన్‌బో హోమ్‌లో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, తదితరులు



రాప్తాడు: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



రాప్తాడు: సెయింట్ విన్సెంట్ డీపాల్ వృద్ధుల అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

అనుమానితుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు

అనంతపురం: అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్, ఫోర్త్ టౌన్ సీఐ జగదీష్ ఆధ్వర్యంలో మంఘలవారం అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. రంగస్వామి నగర్, రుద్రంపేట, డీమార్ట్ వెనుకల ప్రాంతం, తదితర చోట్ల గంజాయిపై నిఘా పెట్టారు. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమ రవాణాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నగరపాలక సంస్థ ఎస్ఈగా రాజశేఖర్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎస్ఈగా రాజశేఖర్ నియమితులయ్యారు. మంగళవారం నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామి వద్ద ఆయన రిపోర్టు చేసుకున్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో ఎస్ఈగా ఉన్న ఆయన బదిలీపై అనంతపురానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈఈలు షాకీర్, నరసింహులు, తదితర సిబ్బంది నూతన ఎస్ఈ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

అనంతపురం: జిల్లా కేంద్రంలో పని చేస్తున్న పోలీసులకు మంగళవారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని పోలీసు ఆసుపత్రిలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, పోలీసు యూనిట్ ఆసుపత్రి వైద్యులు వెంకటేశ్వర ప్రసాద్, ఆర్ఐలు మధు, పవన్‌కుమార్, రాముడు, బాలు, సీఐలు శాంతిలాల్, జయపాల్ రెడ్డి, ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే ఉపేక్షించం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో బోధన ఉపాధ్యాయుల (వైద్యులు) 90 శాతం హాజరుండాల్సిందే అని ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా స్పష్టం చేశారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఫోరెన్సిక్, అనాటమీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. బోధన ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఫేసియల్ యాప్ వేసి పరుగులు పెడతామంటే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఎవరైనా విధులకు గైర్హాజరైతే వారి వివరాలను డీఎంఈకి తెలియజేస్తామన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పెయింటింగ్స్ చూపుతున్న చిన్నారులు

రాప్తాడు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ బొంతు ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గ్రీన్‌డేను ఉత్సాహంగా జరుపుకున్నారు. తొలుత విద్యార్థులతో కలసి మొక్కలు నాటించారు. చిన్నారులు పచ్చరంగు దుస్తులు ధరించి సందడి చేశారు. సిస్టర్ లియా పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

అనంతపురం కల్చరల్: యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ మై భారత్ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. విశ్రాంత ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జి గోవర్ధన శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాతి భరత్ తదితరులు మాట్లాడారు. యువత నైపుణ్యాలను పెంచుకుంటే అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు డీడీ అనురాధ, రూడ్‌సెట్ శిక్షకురాలు ఉషారాణి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఫాతిమా, రామకృష్ణ, వంశీకృష్ణ, అంబరీష్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు, విద్యార్థులు ధర్నా చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జీఓ 77 రద్దు చేయాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. 107, 108 జీఓలను రద్దు చేయాలన్నారు. అర్హులందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బు జమ చేయాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేశారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో చేతివృత్తిదారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు విస్మరించారని ఆ సమాఖ్య నాయకులు ధ్వజమెత్తారు. హామీలను అమలు చేయాలంటూ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 50 ఏళ్లు నిండిన చేతివృత్తిదారులకు పింఛను మంజూరు చేయాలన్నారు. ఇంటి స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేశారు. జిలా కార్యదర్శి హరికృష్ణ చేతి వృత్తుదారుల సంఘాల నాయకులు బంగారు బాషా, రఘు, నాగప్ప పాల్గొన్నారు.

ఎయిమ్స్‌ను రాయలసీమకు తరలించాలి

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం రాయలసీమ సమస్యలపై పసులూరు ఓబిలేసు అధ్యక్షతన చర్చావేదిక నిర్వహించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూడటం అన్యాయం అన్నారు. మెడికల్ సీట్లు కూడా అవసరం లేదని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం సరికాదన్నారు. రాయలసీమలో పరిశ్రమల్లో 60 శాతం స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎయిమ్స్‌ను రాయలసీమకు తరలించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయని.. లైనింగ్‌ను ఆపాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, చంద్ర చర్ల హరి, గోవింద్, శంకర కుళాయప్ప, రాజారత్నం, విజయ్, చంద్రప్ప, ఎర్రిస్వామి, దావీద్, నెరమెట్ల ఎల్లన్న, రామాంజినేయులు, గంగులయ్య, లబ్బే ముత్యాలప్ప, లక్ష్మినారాయణ, ఓబుళయ్య, పులి కిష్ట, హనుమప్ప, ఓబులేసు, వెంకటేశులు, మధు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కార్మికులకు ఐక్య కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

Ward	Sy.No.	A.C.	A.C.	A.C.	H.S.
Old : 4	277/1B	5.14 పైకి	0.10 పైకి	0.05	0.020

New : 8

Present : 11

[illegible] మొత్తం విస్తీర్ణం : 242 చదరపు గజాలు.

హెచ్. రామ స్వామి, అడ్వకేట్
3వ రోడ్డు, అనంతపురము. సెల్: 9440857943

